క్లుప్తంగా

రీసర్వే ప్రారంభం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం లో భూముల రీసర్వేను శుక్రవారం సర్వే డీటీ శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వద్ద ఉన్న పత్రాలను రెవెన్యూ అధికారులకు అందజేయాలన్నారు. సర్వే సక్రమంగా పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హరినాథ్, రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

• మనుబోలు: భూముల రీసర్వే కార్యక్రమాన్ని



మాట్లాడుతున్న తహసీల్దార్

రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య సూచించారు. శుక్రవారం మనుబోలులో రీ సర్వేపై అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి దేవస్థానం వద్ద గ్రామసభ నిర్వహించి రీసర్వే ప్రయోజనాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలు ఈ సర్వేతో సమసిపోతాయన్నారు. రీసర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే సరి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, డీటీ మంజుల, వీఆర్వో నాగార్జునరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



పొదలకూరు : మండలంలోని అంకుపల్లి, డేగపూడి గ్రామాల్లో శుక్రవారం గడ్డి వాములు దగ్ధమైయ్యాయి. ప్రమాదవశాత్తు వాములకు నిప్పంటుకుని మంటలు వ్యాపించడంతో పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అంకుపల్లి ఎస్సీ కాలనీలో సీహెచ్ వెంకటరమణయ్యకు చెందిన సుమారు 600 గడ్డి మోపులు, డేగపూడిలో పీ బాలటబుల్‌రెడ్డికి చెందిన 300 మోపులు అగ్నిప్రమాదాల్లో దగ్ధమయ్యాయని పొదలకూరు అగ్నిమాపకశాఖ అధికారి వరప్రసాద్ వెల్లడించారు.

బుచ్చిలో చిరుజల్లులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు శుక్రవారం కురిసిన చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. మధ్యాహ్న సమయంలో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

• డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు. మాతాశిశు మరణాలపై ఆరోగ్య సబ్ కమిటీ సమావేశం శుక్రవారం నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సంవత్సరం జనవరి నెలలో జరిగిన ఒక మాతృ మరణం, ఆరు శిశు మరణాలకు గల కారణాలు, లోపాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతి మహిళను మొదటి నెలలోనే గుర్తించి వారి వివరాలను రిజిస్టర్ చేయాలన్నారు. తర్వాత క్రమం తప్పకుండా వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. బీపీ, రక్తహీనత ఉన్న హైరిస్క్ గర్భిణుల విషయంలో ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడం, సకాలంలో వారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం అందేలా చూడటం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడొచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సుఖ ప్రసవం జరిగే వరకు ఆరోగ్య కార్యకర్త బాధ్యత వహించాలన్నారు. ఎక్కడైనా సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవిస్తే అలాంటి చోట్ల ఆరోగ్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించాలన్నారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇచ్చేలా వారిని చైతన్యం చేయాలని కోరారు. ఈనెల 7వ తేదీన జరిగే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలను నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శేషారత్నం, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.బెనహర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు.. 'ఆశ'లు

• తగ్గుతున్న దిగుబడులు
• బస్తా కాయలు రూ.9 వేలు



మార్కెట్లో నిమ్మకాయలు

పొదలకూరు : పొదలకూరు మార్కెట్‌లో నిమ్మ ధరలు ఆశాజనకంగా పెరుగుతున్నాయి. కానీ తోటల్లో కాయల దిగుబడి తగ్గుతుండడంతో రైతులు ఆశ, నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం బస్తా (లూజు) టాప్ ధర రూ.9 వేల వరకు ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఏప్రిల్‌లో ధరలు ఇంకా పెరగాల్సి ఉందని రైతులు అంటున్నారు. అయితే తోటల్లో కాయల దిగుబడి క్రమంగా తగ్గుతున్న తరుణంలో ధరలు పెరుగుతుండడంతో ఒక పక్క సంతోషం.. మరో పక్క నిర్వేదం కనిపిస్తోంది. దీనికి తోడు ఎండలు మండుతున్నందున నిమ్మకాయల వాడకం పెరిగి ధరలు ఇంకా పెరిగే అవకాశం లేకపోలేదంటున్నారు. కిలోల వంతున ధరలు పరిశీలిస్తే టాప్ రూ.110 పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. ప్రారంభం ధర కిలో రూ.80 వరకు ఉందని, పండ్లు కూడా రూ.50 ఉన్నట్టు చెప్పారు. సీజన్లో కాయలు ఉన్న రైతులకు మాత్రం మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది. చాలా మంది రైతులకు సీజన్లో కాయలు తగ్గుతుంటాయి. పొదలకూరు పరిసర ప్రాంతాల్లో రైతులకు జనవరి, ఫిబ్రవరి నెలల్లో కాయలు బాగా దిగుబడి అయ్యాయి. అయితే ధరలు అప్పట్లో అంతంత మాత్రంగా ఉండడం వల్ల పెద్దగా లాభాలు ఆర్జించ లేకపోయారు.

తగ్గుతున్న దిగుబడులు

రైతుల నిమ్మ తోటల్లో క్రమంగా దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ ప్రాంతంలో వేల ఎకరాల్లో సాగు అవుతున్న నిమ్మకు అంతర్జాయ మార్కెట్ ఉంది. అయితే వేసవి కాలంలోనే నిమ్మకాయలకు విలువ బాగా పెరుగుతుంది. శీతల పానియాల్లో అధికంగా నిమ్మను ఉపయోగించడం జరుగుతుంది. ఫలితంగా ఉత్తర భారతదేశంలో నిమ్మకు విపరీతమైన డిమాండ్ పెరిగి ధరలు అమాంతం ఎగబాకుతాయి. అయితే ప్రస్తుతం ధరలు పెరిగినా మళ్లీ స్వల్పంగా తగ్గుతున్నట్టు తెలిపారు.

నాణ్యత లోపించి ఉంటే చర్యలు తీసుకుంటాం

• గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి



వరిగొండలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

పొదలకూరు/తోటపల్లిగూడూరు: గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో నిర్మించిన ఇళ్లలో నాణ్యత లోపించి ఉంటే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. శుక్రవారం పొదలకూరు సమీపంలో చిట్టేపల్లి తిప్ప వద్ద, తోటపల్లిగూడూరు మండలం వరిగొండలో నిర్మించిన ప్రభుత్వ లేఅవుట్లలో పక్కా ఇళ్లను మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిలో ఇళ్లను నిర్మించి ఉంటే వారితోనే ఆ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయిస్తామన్నారు. వారికి బిల్లులను సైతం చెల్లిస్తామని, వారు ముందుకు రాకుంటే ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. తిప్పపై లేఅవుట్ నిర్మిస్తే గ్రావెల్ పక్కనున్న గ్రామం నుంచి తోలి నట్టు లీడ్ ఇవ్వడంపై విచారణ చేపడుతామన్నారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్టు స్పష్టం చేశారు.

కాంట్రాక్టర్ల అవినీతిపై చర్యలు

వరిగొండలో మంత్రి మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అనేక అవినీతి ఆరోపణలు వెలుగు చూస్తున్నాయన్నారు. నాసిరకంగా ఇళ్లు నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్లను గుర్తిస్తున్నామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. అసంపూర్తిగా మిగిలిన పక్కా గృహాలను పూర్తి చేసేందుకు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలను అదనంగా కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ ఐదేళ్లలో 10 లక్షల ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో, ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో గృహనిర్మాణశాఖ ఎండీ రాజాబాబు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి



నార్తురాజుపాళెంలో వైద్య బృందం

• వైద్యాధికారి కామాక్షయ్య

కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య కోరారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామానికే వచ్చి వైద్య సేవలందించే బృహత్తర కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ ఎ.స్నేహ, హెచ్‌ఏలు వై.హిమజకుమారి, ఒ.సుధాకర్, ఆశ కార్యకర్తలు జి.శోభ, జి.సరళ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ర్యాలీ రేపు

కొడవలూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై కొడవలూరు మండల క్రైస్తవ సమాఖ్య ఆధ్వర్యంలో నార్తురాజుపాళెంలో ఆదివారం శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లుగా ఆ సమాఖ్య సభ్యులు గోనె దయాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో క్రైస్తవులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన కోరారు.

అకాల వర్షం

పొదలకూరు: పొదలకూరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం అకాలం వర్షం కురిసింది. పిడుగులతో కూడిన వర్షం కురవడంతో జనాలు భీతిల్లారు. వర్షానికి గాలి కూడా తోడు కావడంతో మునగ, అరటి చెట్లు నేలకూలాయి. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన జనాలు ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో కాస్త సేదతీరారు.

వధూవరులకు ప్రసన్న ఆశీర్వాదం



కోవూరు: కోవూరు మండలం శాంతినగర్‌కు చెందిన పోకల సుబ్బారెడ్డి – పద్మజ దంపతుల కుమార్తె ప్రణవి, మోహన్‌రెడ్డి వివాహం శుక్రవారం పీవీఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్ రెడ్డి, కోవూరు టౌన్ అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, మండల కార్యదర్శి మవులూరు వెంకటరమణారెడ్డి తదితరులున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న ఏఓ జహీర్

మనుబోలు: వ్యవసాయ శాఖ, శ్రీ రవి ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో మనుబోలులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం షేక్ జహీర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు దాతల సహకారంతో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ యజమాని దామిశెట్టి వెంకట రంగారావు, సిబ్బంది ఆలూరు కోటి, తూమాటి వరదారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

కామాక్షితాయి సేవలో అదనపు జడ్జి



జడ్జికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయిని శుక్రవారం జిల్లా అదనపు జడ్జి ఎస్.సరస్వతి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది జడ్జిని సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు అందజేశారు.

డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న మహిళలు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు బీసీ కాలనీ (వాటర్ ట్యాంక్ సమీపాన) వద్ద డ్రెయినేజీ నిర్మించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిరసన తెలిపారు. డ్రెయినేజీ నిర్మించకుండా రోడ్డు ఏర్పాటు చేస్తూ ఉండటంతో ఎక్కడపడితే అక్కడే మురుగునీరు నిలిచిపోతుందన్నారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరారు.

జిల్లా కమిటీ ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆంధ్రప్రదేశ్ మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశం శుక్రవారం జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 250 మందికి పైగా మీడియేటర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 23వ డివిజన్ కార్పొరేటర్ డి.శ్రీనివాసులురెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, పి.పుల్లారెడ్డి, ఎం.మధుసూదన్‌యాదవ్, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా పి.విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంవీ రమణయ్య, కార్యదర్శులుగా పి.మస్తాన్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీహెచ్ మమతారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పి.పద్మావతమ్మ నియమితులయ్యారు.

నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో నివాసముంటున్న వారు నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించాలని కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



కోవూరు: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ కాలనీలో కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవంగా జరిగింది. పలు హోమాలను నిర్వహించారు. కార్యక్రమాలు అర్చకులు పరాంకుశం శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



రామాలయం

కోవూరు: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పడుగుపాడులో వేడుకలు సోమవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

వేసవి భత్యం అందేనా?

ఉపాధి కూలీలకు వేసవిలో ప్రత్యేకంగా అందించే భత్యం అమలుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గడిచిన మూడేళ్లుగా వేసవి భత్యం రాకపోవడం.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందపోవడంతో వేసవిభత్యంపై సందిగ్ధం నెలకొంది. దీనికితోడు ఉపాధి పనులు చేపట్టే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు దుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సీతారామపురం: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. సాధారణంగా పల్లెల్లో వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. గతంలో వేసవిలో ఎండలకు ఉపాధి కూలీలు ఉపాధిహామీ పనులు చేయలేని పరిస్థితుల్లో వారిని ప్రోత్సహించేందుకు వేసవి భత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 25 శాతం అదనంగా వేతనాన్ని కూలీలకు అందించేవారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ వచ్చినా ఇప్పటి వరకు వేసవి భత్యంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కూలీలు ఆందోళన చెందున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి. అయితే 2021 నవంబర్‌లో నూతనంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. అందులో వేసవి భత్యానికి సంబంధించి ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదు. అప్పట్నుంచి మూడేళ్లుగా వేసవి భత్యాన్ని అమలు చేయడం లేదు. ఈ ఏడాది కూడా వేసవి భత్యంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అమలుపై వేతనదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూలీల ఆవేదన

జిల్లాలోని 37 మండలాల్లో 2.78 లక్షల జాబ్ కార్డులు ఉండగా 4.38 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. అందులో రోజుకు సుమారు లక్ష మంది వరకు ఉపాధి హామీ పనులకు వెళుతుంటారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 68,650 జాబ్ కార్డులు ఉండగా, 1,14,081 మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వీరిలో ప్రతిరోజూ 20వేల మందికి పైగా ఉపాధి పనులకు వెళుతుంటారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉంటాయి. ఈ తరుణంలో కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఏటా వేసవిలో ఉపాధి కూలీల వేతనాలను రూ.20 నుంచి రూ.30 వరకు పెంచేది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి స్వల్పంగా రూ.7ను మాత్రమే పెంచింది. ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు రూ.307 చొప్పున వేతనం అందజేయనున్నారు. సాధారణంగా వేసవిలో ఎండల తీవ్రతకు కూలీలకు ఎక్కువగా పనిచేయలేరు. భూమి సైతం గట్టిగా ఉండి పనిముందుకు సాగదు. కూలీలు ఎక్కువగా శ్రమపడాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకనుగుణంగా వేసవిలో కూలీలను ప్రోత్సహించేందుకు గతంలో వేసవి భత్యాన్ని అందించే వారు. గత మూడేళ్లుగా వేసవి భత్యాన్ని ఇవ్వడం లేదు. ఈ ఏడాది వేతనాన్ని సల్పంగా పెంచడం, భత్యాన్ని అమలు చేయకపోవడంతో కూలీలు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన చెందుతున్నారు.

కనీస వసతులు కరువు

ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కరువయ్యాయి. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఉపాధి పనులు జరిగే చోట కూలీలు సేదతీరేందుకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి. తాగునీటి వసతి కల్పించకపోతే రూ.5 అదనంగా భత్యం చెల్లించాలి. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. పని చేస్తున్న సమయంలో కూలీలకు గాయాలైతే చికిత్స అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉంచాలి. అయితే ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో ఎక్కడా సౌకర్యాలు కనిపించడం లేదు.

కష్టంగా ఉంటుంది



గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి అదనపు కూలి వచ్చేది. కొంతకాలంగా ఆ ఊసే లేదు. వేసవిలో భూమి గట్టిగా ఉండి పనులు చేసేందుకు కష్టంగా ఉంటుంది. పైగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో కొలతల ప్రకారం పనులు చేయలేం. వేసవి భత్యం అందించి ఉపాధి కూలీలను ఆదుకోవాలి.

– సుబ్బరాయుడు, ఉపాధి కూలీ పడమటి రొంపిదొడ్ల

వసతులు కల్పించాలి



వేసవిలో ఉపాధి పనులు చేసే చోట ఎక్కడా కూడా కూలీలకు సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రదేశంలో సేదతీరేందుకు ఎలాంటి టెంట్లు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఎండలకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసేవారు. ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– కోడె రమణయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి, ఉదయగిరి

మార్గదర్శకాలు లేవు



ఉపాధి కూలీలకు వేసవి భత్యం గురించి ఎలాంటి మార్గదర్శకాలు లేవు. 2021 నవంబర్‌లో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ నుంచి ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌కు ఉపాధి కార్యక్రమాలు మారాయి. అప్పటి నుంచి వేసవి భత్యం లేదు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను ఆదేశించాం. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– మృదుల, ఏపీడీ, ఉదయగిరి